## తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోండి

**మేయర్ మహేందర్‌గౌడ్**

బండ్లగూడ,డిసెంబర్ 22: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని మేయర్ మహేందర్‌గౌడ్ జలమండలి మేనేజర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో తాగునీటి పైపులైన్ల నిర్మాణం లేకపోవడంతో సమస్య తీవ్రరూపం దాలుస్తుందని వివరించారు. వచ్చే వేసవి లోపు అన్ని ప్రాంతాల్లో పైపులైన్ల నిర్మాణం చేపట్టి తాగు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికే అధిక ప్రాధాన్యం

మలక్‌పేట, డిసెంబర్ 22: మూసారాంబాగ్ డివిజన్‌లో రహదారుల నిర్మాణంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మూసారాంబాగ్ డివిజన్ గాంధీనగర్‌లో రూ.14 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికే అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఉమేశ్, మల్లేశ్, శ్రీను, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయం భూమి జోలికి రావద్దు




నార్సింగి పోచారం గుట్ట వద్ద ఆక్రమిత పనులను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్, నాయకులు

- నార్సింగి పోచారం గుట్ట వద్ద ఆందోళన
- పక్క సర్వే నంబర్ భూయజమాని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారంటూ గ్రామస్థుల ఆగ్రహం

మణికొండ, డిసెంబర్ 22: చారిత్రాత్మక పోసారం గుట్ట హనుమాన్, వెంకటేశ్వరాలయ భూముల జోలికి వస్తే సహించేది లేదని నార్సింగి గ్రామస్థులు, హిందూ సంఘాలు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. పూర్తి వివరాల్లోకి వెళితే...గండిపేట రెవెన్యూ మండల పరిధిలోని నార్సింగి గ్రామ సర్వే నం.126లో 6ఎకరాల 08 గుంటల భూమి పోసారం గుట్ట సర్కారు భూమిగా నమోదై ఉన్నది. కాగా సర్వే నం.127 నుంచి 130, 130/పార్టులో 7ఎకరాల 30 గుంటల భూమి తనకు ఉందని భూ యజమాని ఒకరు ఆలయ భూమి పరిధిలో జేసీబీలతో చదును చేస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం స్తూ శుక్రవారం పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఆందోళన చెలరేగి, పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో నార్సింగి పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం నార్సింగి గ్రామస్థులు, హిందూ సంఘాలు కలిసి ఆందోళనకు దిగారు. పోసారం గుట్ట భూములను గతంలోనూ ఓ రియల్టర్ ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారని, ఇప్పుడు పడమటి భాగాన ఉన్న భూ యజమాని ఆలయ ఆనవాళ్లను సైతం లెక్క చేయకుండా జేసీబీలతో చదును చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ భూముల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని, ఆలయ భూముల చుట్టూ రియల్టర్లు కుట్రపూరితంగా విలువైన భూములను ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్‌యాదవ్, నాయకులు వేణుగౌడ్, వినోద్‌కుమార్, ప్రభాకర్, రాము, వెంకటేశ్, గాంధీ, రాజీవ్ ఆరోపించారు. రెవెన్యూ అధికారులు సైతం పారదర్శకంగా సర్వేలు చేసి ఆలయ భూమిని పరిరక్షించాలని కోరారు. అదేవిధంగా కొండలు, గుట్టలతో ఆహ్లాదకరంగా ఉన్న పోచారం గుట్టను రాత్రికిరాత్రే చెట్లను, రాళ్లను తొలగించిన ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నార్సింగి గ్రామస్థులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా తమకు చెందిన భూమికి హద్దురాళ్లను చూపించేందుకు సహరించలేదని భూ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయానికి సంబంధించిన సర్వే నంబరు భూమిని ఆక్రమించుకోవాల్సిన అవసరం తమకు లేదని, తాను నిత్యపూజలు చేస్తానని, ఆలయానికి ఇరు వర్గాలు కలిసి భూమిని కేటాయిస్తూ, తమకు న్యాయం చేయాలని సదరు భూ యజమానికి పోలీసుల సమక్షంలో కోరారు. ప్రభుత్వ అధికారుల సర్వే తర్వాత పరిష్కరించుకోవాలని, అప్పటి వరకు ఎవరూ వివాదాస్పద భూమిలోకి వెళ్లవద్దంటూ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఇరువర్గాలకు సూచించారు. దీంతో ఆందోళన విరమించారు.

## మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు



శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్కను రాజేంద్రనగర్ ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ రామేశ్వరం నరేందర్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వనం నర్సింహా మాదిగ, జిల్లా స్థాయి నాయకులు సింగదాసరి నరేశ్ మాదిగ, ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, రామేశ్వర్, ఆనంద్‌నాయుడు తదితరులు మంత్రిని కలిసి వారిలో ఉన్నారు. *- మణికొండ, డిసెంబర్ 22*

## జీఎస్ఐ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మన్సూరాబాద్, డిసెంబర్ 22: ఖనిజాల అన్వేషణలో కొత్త సాంకేతికతలు అనే అంశంపై శుక్రవారం ఎల్బీనగర్, నాగోల్, బండ్లగూడలోని భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణా సంస్థ (జీఎస్ఐటీఐ) ప్రాంగణంలోని ఎంఎస్ కృష్ణన్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావును ఆల్ ఇండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్శ మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలబొకేను అందజేశారు. జీఎస్ఐ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను కాంతారావుకు వివరించారు. జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ జనార్దన్‌ప్రసాద్, ఏడీజీ, హెచ్ఓడీ సీహెచ్. వెంకటేశ్వర రావు, డీడీజీలు బి. అజయ్‌కుమార్, ఎంఎల్ దొర, అసోసియేషన్ ప్రతినిధులు ఎం. చక్రేశ్వర్, బి. ఆనంద్‌కుమార్, ఏ. శివశంకర్, జి. మల్లేశ్, బి. లింగ్యా, మాధ్యూ, ఈ. చంద్రయ్య, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుల అరెస్టు

మాదన్నపేట, డిసెంబర్ 22: రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్య కేసును ఐఎస్ సదన్ పోలీసులు ఛేదించారు. శుక్రవారం ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రోహిత్ రాజు వివరాలను వెల్లడించారు. పీఎస్ పరిధిలోని రామ చంద్రాపురంలో నివసించే తారిక్ అలీ (39) రియల్ ఎస్టేట్ వ్యాపారి. సెటిల్‌మెంట్ దందాలు కూడా చేస్తాడు. అతడిపై రెయిన్‌బజార్, అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌లో రెండు హత్య కేసులు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. పీడీఎఫ్ బియ్యం అక్రమంగా తరలించే మహ్మద్ మజర్, ముజామి కలీమ్ ఖాన్, అఫ్రోజ్‌ను తారిక్ అలీ బెదిరించి నెలకు లక్ష రూపాయలు ఇవ్వాలని, లేకుంటే అధికారులు, పోలీసులకు పట్టిస్తానని హెచ్చరించాడు. గతంలో కూడా బార్‌లో మజర్ గ్యాంగుకు వేరే గ్యాంగుతో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య రాజీ కుదిరిస్తానని చెప్పి.. మజర్ నుంచి రెండు లక్షలు తీసుకొని.. రాజీ కుదర్చలేకపోయాడు. ఆ తర్వాత కూడా వ్యాపారంలో నెలకు లక్ష రూపాయలు ఇవ్వాలని తారిక్ అలీ బ్లాక్ మెయిల్ చేశాడు. దీంతో అతడి అడ్డు తొలగించుకోవాలని మజర్ గ్యాంగు పథకం వేసింది. రెక్కీ నిర్వహించారు. ఈ నెల 18న తారిక్ అలీ తన ఇంటి వద్ద ఉన్నాడన్న విషయం తెలుసుకొన్న నిందితులు అతడిపై కత్తులతో దాడి చేసి, హత్య చేసి వికారాబాద్ పారిపోయారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు హత్య కేసులో పాల్గొన్న ఏడుగురు నిందితులతో పాటు ఒక బాలుడిని కూడా అరెస్ట్ చేశామన్నారు. మైనర్‌ను జువైనల్ హోంకు, ఏడుగురుని జైలుకు తరలించామన్నారు. నిందితుల వద్ద నుంచి ఏడు సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలు, కత్తులు స్వాధీనం చేసుకున్నామని డీసీపీ తెలిపారు. ఏసీపీ మహ్మద్, ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, ఎస్ఐలు అశోక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



ఇటీవల సీఎంవో చీఫ్ పీఆర్‌వోగా నియమితులైన అయోధ్యరెడ్డిని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీశ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు కిరణ్‌రెడ్డి ఇతర అధికార ప్రతినిధులు పాల్గొన్నారు. *-(బండ్లగూడ,డిసెంబర్ 22)*

## గ్రేడ్-2 కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి

**వీడ్కోలు పలికిన మార్కెట్ అధికారులు, పాలకవర్గ సభ్యులు**

మలక్‌పేట, డిసెంబర్ 22: మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో గ్రేడ్-3 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వి.రవీందర్‌రెడ్డి గ్రేడ్-2 కార్యదర్శిగా పదోన్నతిపై చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌కు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న రవీందర్‌రెడ్డిని మార్కెట్ ఉప సంచాలకులు, ఉన్నతశ్రేణి కార్యదర్శి దామోదర్, మార్కెట్ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితా నాయక్, వైస్ చైర్మన్ భూమేశ్వర్, డైరెక్టర్లు రవికాంత్, విద్యానంద్, యాదగిరి, సల్మాన్ మహ్మద్‌ఖాన్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు దేవర రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు కట్టా మల్లేశం, ఉల్లిగడ్డ, మిర్చి కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. మలక్‌పేట మార్కెట్‌లో రవీందర్‌రెడ్డి అందించిన సేవలను పలువురు కొనియాడారు. మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



వెంచర్లలో బయటపడ్డ

## వేంకటేశ్వరస్వామి పురాతన విగ్రహం

మహేశ్వరం, డిసెంబర్ 22: మహేశ్వరం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఓ ప్రైవేటు వెంచర్‌లో జేసీబీ వాహనంతో పనులు చేస్తుండగా వేంకటేశ్వరస్వామి పురాతన విగ్రహం లభ్యమైంది. ఈ విగ్రహం అతి పురాతన కాలం నాటి విగ్రహం అని స్థానిక ప్రజలు పేర్కొన్నారు. ఈ విగ్రహానికి ప్రజలు పూజలు నిర్వహిస్తున్నారు.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



విద్యార్థుల ప్రదర్శను తిలకిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ/సైదాబాద్/అత్తాపూర్/కందుకూరు, డిసెంబర్ 22: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో భవిష్యత్తులో ముందుకు సాగాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ గణిత దినోత్సవ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన గణిత ప్రదర్శనకు ఆయన మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ రామకృష్ణారెడ్డితో కలిసి విద్యార్థులు నిర్వహించిన గణిత ప్రదర్శను తిలకించారు. పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్లు అందరిని ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు నిరంజన్, మణికొండ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు చిలుకూరి, యువమోర్చా అధ్యక్షులు రవికాంత్‌రెడ్డి, టీఆర్ఎస్వీ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

**సైదాబాద్‌లో..**

చంపాపేటలోని శ్రీత్రివేణి పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. గణితశాస్త్ర ప్రదర్శనలో 180 గణిత శాస్త్ర నమూనాలను చార్టుల రూపంలో విద్యార్థులు తమ నైపుణ్యంతో తయారు చేసి చక్కగా ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో శ్రీత్రివేణి స్కూల్స్ డైరెక్టర్, కరస్పాండెంట్ కె. గోవర్ధన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శారద, వైస్ ప్రిన్సిపాల్ సిద్దిరాం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

**అత్తాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో..**

అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీలత ఆధ్వర్యంలో భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, క్విజ్, భజల్ తదితర పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

**కందుకూరులో..**

రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని బాలికల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు, ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన బోధనోపకరణాలు చూపరులను ఆకట్టుకున్నాయి. బాలికల ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భార్య హత్య కేసులో..భర్తకు యావజ్జీవ శిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): భార్యపై అనుమానంతో విచక్షణ రహితంగా దాడిచేసి హత్య చేసిన భర్త వంకాడవత్ రవి (40)కి జీవిత ఖైదుతో పాటు రెండు వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి రత్నప్రభ తీర్పునిచ్చారు. అదనపు పీపీ డి.రఘు కథనం ప్రకారం.. కందుకూరు మండలం మురళీనగర్‌కు చెందిన బుజ్జితో 2001లో రవి వివాహమై, ముగ్గురు పిల్లలతో కలిసి ఉన్నారు. నాలుగేండ్ల కిందట బతుకుదెరువు నిమిత్తం మహేశ్వరానికి వలసొచ్చారు. కొంత కాలం తర్వాత భార్యపై అనుమానం పెంచుకున్న భర్త నిత్యం శారీరకంగా వేధించాడు. దీంతో బుజ్జి కుటుంబ సభ్యులు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి, ఇరువురికి నచ్చజెప్పారు. అయితే, 2018, జనవరి 6న రాత్రి బుజ్జితో అకారణంగా గొడవపడిన నిందితుడు రవి.. కట్టెతో ఇష్టానుసారంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆమె మృతి చెందింది. జరిగిన ఘటనపై మృతురాలి సోదరుడు మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అనంతరం దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం.. నిందితుడు రవికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

## కుట్రలో భాగమే సభలో నుంచి ఎంపీల సస్పెండ్

శంషాబాద్ రూరల్/మణికొండ, డిసెంబర్ 22 : పార్లమెంట్‌లోకి అగంతకులు లోపలికి వచ్చి పార్లమెంట్ సభ్యులకు భద్రత లేకుండా చేయడంపై ప్రశ్నిస్తే ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయడంపై ప్రధాని మోదీ కుట్రలో భాగమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, గండిపేట మండల సీపీఎం పార్టీ కన్వీనర్ జాజాల రుద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ నాయకులు, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో హిమాయత్‌సాగర్ సమీపంలోని అప్పా జంక్షన్ వద్ద వేర్వేరుగా ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, సీపీఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఇద్దరు బాలికలు అదృశ్యం

బడంగ్‌పేట, డిసెంబర్ 22: ఇద్దరు బాలికలు అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. బాలాపూర్ చౌరస్తాలోని ఎస్‌వీ ఆసుపత్రి యజమాని జ్యోతి కుమార్తె లక్ష్మీప్రసన్న(11), బడంగ్‌పేట శ్రీలక్ష్మి హిల్స్ కాలనీకి చెందిన మహేశ్ ప్రసాద్ కుమార్తె శాన్వి దుర్గాప్రసాద్(11)కంచన్‌బాగ్‌లోని డీపీటీ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నారు. ఇద్దరు క్లాస్ మెంట్స్. శుక్రవారం సాయంత్రం ఇంటి వచ్చి ట్యూషన్ వెళ్తున్నామని చెప్పి బయటకు వెళ్లారు. లక్ష్మీ ప్రసన్న బాలాపూర్‌కు చౌరస్తాకు వచ్చి ఓ వ్యక్తి ఫోన్ తీసుకొని శాన్విదుర్గాప్రసాద్‌కు ఫోన్ చేసి పిలిపించుకొని ఇద్దరు కలిసి వెళ్లిపోయారు. వారి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారు. స్కూల్‌కు వెళ్లి తోటి విద్యార్థులను విచారించారు. క్లాస్‌లో మార్కులు తక్కువగా వచ్చాయని చర్చించుకున్నారని, తోటి విద్యార్థులు పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.